10న ముక్కోటి ఏకాదశి వేడుకలు




ఇల్లందకుంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రం లోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవాల యంలో ఈ నెల 10న ముక్కోటి ఏకాదశి (ఉత్తర ద్వార దర్శన) వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో కందుల సుధాకర్ శనివారం తెలిపారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా డిసెంబరు 16నుంచి జనవరి 14 వరకు కార్యక్రమాలు జరపనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 10న ఉదయం 5:30 గంట లకు స్వామి వారు వైకుంఠ ద్వారం నుంచి భక్తులకు దర్శనం ఇస్తారని తెలిపారు. 11న ఉదయం 10గంట లకు శ్రీగోదారంగ నాయకస్వామి కుడారై ఉత్సవం అమ్మవారి నోము జరుగనున్నట్లు తెలిపారు. 13న ఉదయం 10 గంటలకు శ్రీగోదారం గ నా యకుల (అండాళ్) కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

కరీంనగర్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్‌లు డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం, రెండవ పీఆర్‌సీలో 26 వేల రూపాయల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాకు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపెల్లి పోచయ్య, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు ముక్కెర బుజ్జమ్మ, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రాజమల్లయ్య, కవ్వంపెల్లి రవి, శ్యాంసుందర్, కమల గంగయ్య, పద్మ, మల్లేశం, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కొత్తపల్లి స్థానంలో కొత్త మండలం



- తెరపైకి వచ్చిన రెండు గ్రామాల డిమాండ్లు
- చారిత్రక నేపథ్యం ఉందంటున్న ఎలగందల్
- పెద్ద గ్రామంగా, అనువైన కేంద్రంగా ఉన్నామంటున్న బావుపేట
- మంత్రి 'పొన్నం'దే తుది నిర్ణయం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లాలో బావుపేట, ఎలగందల్ పేరిట కొత్త మండల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. కొత్తపల్లి మున్సిపాలిటీని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసిన తర్వాత ఈ ప్రతిపాదనతో ఆయా గ్రామాల ప్రజలు ప్రయత్నాలు ప్రారంభించారు. కొత్తపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేసిన నాటి నుంచే అత్యధిక జనాభా ఉన్న బావుపేటను మండల కేంద్రం చేయాలని అక్కడి ప్రజలు కోరుతూ వస్తుండగా, చారిత్రక నేపథ్యంతోపాటు పెద్ద పంచాయతీగా ఉన్న ఎలగందల్‌ను మండల కేంద్రం చేయాలని అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కరీంనగర్ మండలంలో ఒక పంచాయతీగా ఉన్న కొత్తపల్లిని జిల్లాల విభజన తర్వాత మండల కేంద్రంగా మార్చారు. ఆ తర్వాత దీనిని మున్సిపాలిటీగా ప్రకటించారు. తాజాగా ఈ మున్సిపాలిటీని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పంచాయతీగా ఉన్న కొత్తపల్లి మండలంగా, మున్సిపాలిటీగా మారి చివరకు కార్పొరేషన్‌లో విలీనం కావడంతో దాని పేరిటే మండల కేంద్రం ఉండడంలో ఔచిత్యం లేదని ప్రజలు భావిస్తున్నారు. కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు ఆ మండలంలో ఉన్న చింతకుంట, మల్కాపూర్ గ్రామాలను కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. దీంతో మండలంలో మిగిలిన మిగతా గ్రామాలతోపాటు గంగాధర మండలంలోని ఒద్యారం గ్రామ పంచాయతీని కూడా ఈ మండలంలోనే విలీనం చేస్తూ కొత్త మండల కేంద్రం ప్రకటించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బావుపేట కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని కొందరు, ఎలగందల్ కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని మరికొందరు డిమాండ్ చేస్తూ ప్రయత్నాలు ప్రారంభించారు. బావుపేట పంచాయతీకి చెందిన ప్రజలు ఇటీవల ఇదే డిమాండ్‌తో ధర్నా చేయడమే కాకుండా ఒక ప్రతినిధి బృందం మంత్రి పొన్నం ప్రభాకర్ వద్దకు వెళ్లి తమ పంచాయతీని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు. దానికి మంత్రి సానుకూలంగా స్పందించారని ప్రచారం జరుగుతున్నది. మరోవైపు ఎలగందల్ గ్రామస్థులు మండలంలోనే పెద్ద పంచాయతీగా ఉండడమే కాకుండా తమకున్న చారిత్రక నేపథ్యాన్ని పరిగణలోకి తీసుకుని మండల కేంద్రంగా ఎలగందల్‌ను ప్రకటించాలని కోరుతున్నారు. కుతుబ్‌షాహి వంశం, మొఘల్ సామ్రాజ్యం, హైదరాబాద్ నిజాం హయాంలో ఎలగందల్ కేంద్రంగా జిల్లా ఉండేదని, ఎలగందల్ కోట జిల్లా ప్రధాన కార్యాలయంగా పాలన నిర్వహించేదని చరిత్ర చెబుతున్నది. 1905లో ఎలగంగల్ ఖిలాదార్ సయ్యద్ కరీమొద్దీన్ పేరిట కరీంనగర్ జిల్లాగా దీనిని ఏర్పాటు చేసి జిల్లా కేంద్రాన్ని కరీంనగర్‌కు తరలించారు. ఆ తర్వాత ఎలగందల్ ఖిల్లా టూరిజం ప్రాంతంగా మిగిలిపోయింది. ఒకప్పటి జిల్లా కేంద్రం అయిన ఎలగందల్‌ను మండలంగా మార్చితే చారిత్రక నేపథ్యాన్ని కాపాడినవారమవుతామని అక్కడి ప్రజలు కోరుతున్నారు. ఆసిఫ్‌నగర్ (బావుపేట), ఎలగందల్, కమాన్‌పూర్, ఖాజీపూర్, నాగులమల్యాల, బద్దిపల్లి, ఒద్యారం గ్రామ పంచాయ తీలతో మండలాన్ని పునర్వ్యవస్థీకరించి మండల కేంద్రంగా బావుపేటను కాని, ఎలగందల్‌ను కాని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌కు ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. మంత్రి పొన్నం ప్రభాకర్ బావుపేట, ఎలగందల్‌లో దేనివైపు మొగ్గుచూపుతారో అన్నదానిపైనే మండలం ఏర్పాటు ఆధారపడి ఉన్నదని భావిస్తున్నారు. త్వరలోనే కొత్తపల్లి మండలం స్థానంలో కొత్త మండలం ఏర్పడటం ఖాయం అనే చర్చ నడుస్తోంది.

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో

నేడు ముత్యాల ముగ్గుల పోటీలు

- వాణీనికేతన్‌లో ఏర్పాట్లు.. ఉదయం 10 గంటల నుంచి పోటీలు
- ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పార్టిసిపేషన్ బహుమతులు



కరీంనగర్ కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతియేటా మాదిరిగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి కరీంనగర్ ముఖరంపురలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదురుగా గల వాణీనికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వేదికగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించనుంది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహణలో రాష్ట్ర స్థాయిలో ప్రధాన స్పాన్సర్‌గా సంతూర్, కో స్పాన్సర్‌లలో గార్డెనింగ్ పార్టనర్‌గా క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సంస్థలు, స్థానిక జిల్లా స్పాన్సర్‌గా టవర్ సర్కిల్‌లోని వర్ష జువెల్లర్స్ ఆధ్వర్యంలో జరిగే పోటీలకు మహిళలు, యువతల నుంచి ఆహ్వానం పలుకుతోంది. ప్రథమ బహుమతి కింద 6 వేలు, ద్వితీయ బహుమతి కింద 4 వేలు, తృతీయ బహుమతి కింద 3 వేల రూపాయలతో పాటు కన్సోలేషన్ అలాగే పార్టిసిపేషన్ బహుమతులను అందజేయనున్నారు. పోటీల్లో మహిళలు పాల్గొనాలి. చుక్కల ముగ్గులు మాత్రమే చేతితో వేయాలి. పరికరాలు వాడరాదు. జల్లెడ మాత్రం వాడవచ్చు. ముగ్గు, రంగులు, పువ్వులు ఇతరత్రా సామగ్రి పోటీదారులే తెచ్చుకోవాలి. ముగ్గు వేయడానికి గరిష్ట సమయం రెండు గంటలు. గొబ్బెమ్మలు, బతుకమ్మ వంటివి తప్ప ఇతర వస్తువులు ఎక్కువగా అలంకరించరాదు. వాడితే మార్కులు కట్ అవుతాయి. ముగ్గులో గొబ్బెమ్మలను, బతుకమ్మలను అమర్చవచ్చు. ఇళ్ల నుంచి కలశాలు, అందమైన ఇతర వస్తువులు తీసుకవచ్చి, అమర్చి వాటి చుట్టూ నామమాత్రంగా ముగ్గు వేయడం సరికాదు. ముగ్గు అదనపు అందానికే వస్తువులను వాడాలి తప్ప ఇతర వస్తువులు ప్రాధాన్యం కాకూడదు.

- పోటీల్లో పాల్గొనే వారు ఇతర వివరాలకు, పేర్ల నమోదుకు 7780659809, 9985456222, 9000488682, 9963999090 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు

సినిమాలు యువతను సన్మార్గంలో నడిపించాలి

- తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ జి వెన్నెల
- హాజరైన రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్
- రాష్ట్ర స్థాయి మానేటి లఘుచిత్ర పోటీల అవార్డుల ప్రదానోత్సవం

కరీంనగర్ కల్చరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యువతను సన్మార్గంలో నడిపించే సినిమాలు రావాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ జి వెన్నెల అన్నారు. రాష్ట్రంలోని లఘు చిత్ర కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, కరీంనగర్ ఫిలిం సొసైటీ, తెలంగాణ లఘు చిత్ర నిర్మాతల మండలి సంయుక్తంగా రాష్ట్ర స్థాయి మానేటి లఘు చిత్ర పోటీలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి ఫిలింభవన్‌లో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జి వెన్నెల మాట్లాడుతూ చిన్న పిల్లలపై సినిమాల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, వారిని తప్పుదారి పట్టించే సినిమాలు తీయరాదని అన్నారు. అతిథులుగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, మహాత్మా జ్యోతీబాపూలే విద్యా సంస్థల జాయింట్ సెక్రెటరీ జీవి శ్యాంప్రసాద్‌లాల్, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కార్యక్రమ స్పాన్సర్, తెలంగాణ లఘు చిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు తంగెడ అశోక్‌రావు, జ్యూరీ సభ్యులు అక్షర కుమార్, కె మల్లారెడ్డి, పీఎస్ రవీంద్ర పాల్గొని మాట్లాడారు. ప్రథమ బహుమతి కింద అక్షర చిత్రానికి 20 వేల రూపాయలు, కొరమీను చిత్రానికి 10 వేల రూపాయలు, తృతీయ బహుమతి కింద దర్శ్‌హే చిత్రానికి 5 వేల రూపాయల నగదు బహుమతులు అందజేశారు. బార్డర్‌లో జవాన్, సూర్యుడు, చెట్టు నీడ కిరాయికిత్త, కోడలికి మళ్లీ పెళ్లి చేసిన అత్త, శ్రీకృష్ణ సత్య చిత్రాలకు వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతులు, మిగిలిన పోటీ దారులకు ప్రశం సాపత్రాలు అందజేశారు.

కఫిసొ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫెస్టివల్ కోఆర్డినేటర్ కె లక్ష్మీగౌతమ్, కార్యక్రమ సమన్వయ కర్త మాడిశెట్టి గోపాల్ హాజరయ్యారు.



మాట్లాడుతున్న తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ జి వెన్నెల

రేపటి నుంచి ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 11 ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 6 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌వి ఎస్ జనార్దన్‌రావు తెలిపారు. 6నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు తెలంగాణ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13న ఉదయం 6వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 7నుంచి 10వ తరగతి విద్యార్థులు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

ప్రతి పాఠశాలలో 6వ తరగతిలో 100 సీట్లకు, 7నుంచి 10వ తరగతి వరకు ఆయా పాఠశాలల్లో మిగిలిన సీట్లకు ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు.

దృఢసంకల్పంతో ఉన్నత స్థానాల్లో నిలవాలి

- కలెక్టర్ పమేలాసత్పతి

భగత్‌నగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధులు దృఢసంకల్పంతో ఉన్నతస్థానాల్లో నిలవాలని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి పురస్కరించుకుని బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్యాలెండర్ ఆవిష్కరించి, కేక్ కట్‌చేసి, అంధులైన ఉద్యోగులను సన్మానించారు. అనంతరం మహిళా శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ అంధులంటే సానుభూతి చూపకుండా చేయూతనందించాలన్నారు. నగరంలోని అంధుల పాఠశాలలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలకు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అంధుల సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు రాజయ్య అంధులైన విద్యార్థులకు నోట్‌బుక్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీడబ్ల్యుఓ సబిత, ఎంసిహెచ్ పి సనా జువేరియా పాల్గొన్నారు.

సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. హమాలీ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, ప్రభుత్వం, సివిల్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్ వారు హమాలీ కూలీ రేట్లు పెంచి బకాయిలు చెల్లించాలన్నారు. అధికారులు హామీ ఇచ్చి సంవత్సరం గడుస్తున్నా నేటికీ అమలు కాక పోవడం దురదృష్టకరమన్నారు. కార్మికుల సమ్మెను విచ్చిన్నం చేయడానికి అధికారులు ప్రయత్నాలను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, తెలంగాణ సివిల్ సప్లై కార్పొరేషన్ హమాలీ యూనియన్ నాయకులు అంజయ్య, ఎ రాజయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

సంక్రాంతి పురస్కారం ప్రదానం



ప్రశంసాపత్రం, షీల్డ్‌తో యాదగిరి శ్రీనివాస్

రామగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన యాదగిరి శ్రీనివాస్ సంక్రాంతి పురస్కారం అందుకున్నారు. సేంద్రియ విధానంలో పురాతన వరి విత్తనాలు సాగుచేసి భవిష్యత్ తరాల కోసం భద్రపరుస్తున్న రైతు కేటగిరిలో పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుంటూరు జిల్లా కేంద్రం సమీప వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, రైతు నేస్తం ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం నిర్వహించిన సంక్రాంతి పురస్కారాల్లో శ్రీనివాస్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. శ్రీనివాస్‌ను మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, రేండ్ల శారద, కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ వెము కనకయ్య, మాజీ వార్డుసభ్యుడు వేణుగోపాల్ అభినందించారు.

రాగి వైర్లు చోరీ

చొప్పదండి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్ శివారులోని మెగా ఇంజనీరింగ్ కంపెనీలో సింగిల్ కోర్ రాగివైర్లు, రాగి బస్ బార్లు చోరీకి గురయ్యాయి. 21 లక్షల 54 వేల రూపాయల విలువ గల వైర్లు, బార్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని కంపెనీ మెకానికల్ ఇంజనీర్ నేనావత్ గోపాల్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు.

బాలిక కిడ్నాప్

జగిత్యాలరూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన ఓ బాలికను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల మేరకు సదరు బాలిక జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంది. శనివారం గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి బాలికను కిడ్నాప్ చేసినట్లు ఎస్సై తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీజన్ ప్రారంభంలోనే..

- మామిడి రైతుల్లో దిగులు..
- చెట్లకు నామమాత్రపు పూత
- ప్రతీ సీజన్‌లో తప్పని తిప్పలు
- వాతావరణంలో మార్పులే కారణమంటున్న అధికారులు
- తగ్గనున్న దిగుబడిపై అన్నదాతల ఆందోళన



నామమాత్రంగా ఉన్న మామిడి పూత

జగిత్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో మామిడి రైతులకు దిగులు మొదలైంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మామిడి పూత రాకపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో పచ్చి పూత దశలో ఉండడం, ఇంకొన్ని ప్రాంతాల్లో పూత రాలుతుండడం వంటివి చోటుచేసుకున్నాయని రైతులు అంటున్నారు. పూత ఆలస్యంగా రావడం, రాలుతుండడం కారణంగా దిగుబడి తగ్గే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. జగిత్యాల జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటగా రైతులు మామిడిని సాగు చేస్తున్నారు.

● మామిడి సాగులో రెండో స్థానం....

రాష్ట్రంలో ప్రస్తుత సీజన్‌లో 2.91 లక్షల ఎకరాలకు పైగా రైతులు మామిడి సాగు చేస్తున్నారు. సుమారు 55 వేల ఎకరాల్లో సాగు చేస్తూ జగిత్యాల జిల్లా మామిడి స్థానంలో రెండో స్థానంలో ఉంది. పెట్టుబడి ఖర్చులు భరించే స్థోమత ఉన్న రైతులు సొంతంగా మామిడి తోటలను నిర్వహిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బంది ఉన్న వారు తోటలు పూతరావడానికి ముందే లీజుకు ఇస్తున్నారు. ఈసారి పూత ఆలస్యంగా వస్తుండడంతో అటు రైతులు, ఇటు లీజు దారులు ఆందోళనకు గురవుతున్నారు. ఈసారి ఎకరాకు 3 నుంచి 3.5 టన్నుల వరకు దిగుబడి రావచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. పెట్టుబడి ఖర్చులు వస్తాయోలేదోనని దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. రెండు, మూడు సంవత్సరాలుగా మామిడికి పూత సరిగా రాకపోవడం, వచ్చినా నిలవకపోవడం వల్ల రైతులకు ఆశించిన దిగుబడి రావడం లేదు.

● కలిసి రాని వాతావరణ పరిస్థితులు...

మామిడి పూత సాధారణంగా నవంబర్ చివరి వారం నుంచి ప్రారంభమై జనవరి మొదటి, రెండో వారం వరకు వస్తుంటుంది వాతావరణంలో మార్పులు ఏర్పడి పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో భారీగా వ్యత్యాసం ఉండడం సైతం పూతపై ప్రభావం చూపుతోంది. పూత విచ్చుకునే దశలో చలి ప్రభావంతో పొడి వాతావరణం ఉండడం లేదు. జనవరి మొదటి వారంలో సైతం పూత ఆశించిన మేరకు రాకపోవడంతో రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

మామిడి పంటకు తెగుళ్ల సోకడం వల్ల మున్ముందు మామిడి కాయల దిగుబడి తగ్గుతుందన్న ఆందోళనలో రైతాంగం ఉంది. జగిత్యాల జిల్లాలో ప్రతీ యేటా సుమారు రూ. 400 కోట్ల మామిడి వ్యాపారం జరుగుతుంటుంది. ఇక్కడ నుంచి మామిడి కాయలను ముంబాయి, బెంగుళూరు, చెన్నయి, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. మామిడికి మద్దతు ధరను ప్రకటించమని రైతులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

వాతావరణ మార్పులతోనే దిగుబడిపై ప్రభావం

- జంగిటి రాజేందర్, మామిడి రైతు, బండలింగాపూర్, జగిత్యాల జిల్లా



ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా పూత, కాతపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో దిగుబడి తగ్గుతుందని ఆందోళన చెందాల్సి వస్తోంది. ముందుగా పూతకు వచ్చిన తోటలకు పెద్దగా ఇబ్బందులేమి లేకపోగా, పూత ఆలస్యంగా వచ్చిన తోటల్లో మాత్రం దిగుబడిపై ప్రభావం చూపే పరిస్థితులు ఉన్నాయి.

జాగ్రత్తలు తీసుకుంటే మేలు

- స్వాతి, ఉద్యానవన పంటల శాస్త్రవేత్త, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం, పొలాస, జగిత్యాల జిల్లా



మామిడి చెట్లకు ప్రస్తుత సమయంలో పూత ఆలస్యంగా వస్తోంది. వారం రోజుల క్రితం వరకు వాతావరణంలో చల్లదనం ఉండడం వల్ల రాలేదు. ఇప్పటికే సగానికి పైగా పూత రావాల్సి ఉంది. పూత ఇప్పటివరకు రానట్లయితే పొటాషియం నైట్రేట్ అనే రసాయనాన్ని పిచికారి చేయాలి. కొత్త పూత వస్తున్నప్పుడు తేమ మంచు పురుగును గుర్తిస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే సంక్రాంతిలోపు పూత వచ్చే అవకాశాలున్నాయి.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మల్లాపూర్, జనవరి, 4 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై మానసిక పరిస్థితి సరిగా లేక ఓ యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజుకుమార్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన బండారి మోహన్(38) కొంతకాలం నుంచి మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. మానసిక పరిస్థితి సరిగా లేక జీవితంపై విరక్తి చెంది శనివారం గ్రామంలో ఓ రేకుల షేడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మోహన్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

గంగాధర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన వేముల బాలమల్లు(46) కొంతకాలంగా అప్పుల బాధతో ఇబ్బంది పడుతున్నాడు. అప్పులు తీర్చే మార్గంలేక మనస్తాపం చెంది శుక్రవారం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం వరంగల్‌కు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలోనే మృతి చెందాడు. శనివారం బాలమల్లు భార్య వేముల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై శనివారం కారు, బైక్‌ను ఢీ కొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన తాళ్ల దేవేందర్ తన అవసరాల నిమిత్తం బైక్‌పై కేశవపట్నం వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తున్న క్రమంలో తాడికల్ పాత సినిమా టాకీస్ ఎదురుగా కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. కిందపడిన దేవేందర్ తలకు, కుడి చేయికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది కరీంనగర్‌కు తరలించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లి గ్రామశివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి బందెల రాజశేఖర్ అనే వ్యక్తి గాయాలపాయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాజశేఖర్ పొలం పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న తరుణంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి కింద పడ్డాడు. స్థానికులు గమనించి అంబులెన్స్ ద్వారా పెద్దపల్లికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం పర్మిట్‌గదిలో వృద్ధుడి మృతి

కరీంనగర్ అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ భగత్‌నగర్‌లోని ఒక వైన్‌షాపునకు అనుబంధంగా ఉన్న పర్మిట్ గదిలో భగత్‌నగర్‌కు చెందిన వృద్ధుడు మహ్మద్ యూనిస్(63) శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఒకటో టాణా పోలీసులు తెలిపిన వికరాల ప్రకారం.. పర్మిట్ గదిలో సప్లయర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసగా మారిన యూనిస్‌ను నిర్వాహకులు నాలుగు రోజుల కిందట పని మాన్పించారన్నారు. అయినప్పటికీ శనివారం మధ్యాహ్నం బయట మద్యం సేవించిన యూనిస్ పర్మిట్ గదిలోకి వెళ్లి కిందపడిపోగా, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అప్పటికే యూనిస్ మృతి చెందాడు. మద్యం బాగా తాగడం లేదా అనారోగ్యంతో యూనిస్ మృతిచెంది ఉంటాడని అతడి కొడుకు రహీం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కోరుట్ల పట్టణంలో వరుస చోరీలు



చోరీ జరిగిన దుకాణ సముదాయం

కోరుట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో వరుస చోరీలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పట్టణంలోని మెట్‌పల్లి రోడ్డులో ఉన్న మూడు దుకాణ సముదాయాల షెటర్లను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి పగులగొట్టిన చోరీకి పాల్పడ్డారు. ఓం దుర్గా ఆటో మొబైల్, కిడ్స్ మాల్, రాందేవ్ ప్లైవుడ్ దుకాణాల సముదాయాల షెటర్లను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. కౌంటర్లలో ఉన్న సుమారు 12,000 నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలసుకున్న పోలీసులు దుకాణ సముదాయంలో సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

వేములవాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డబ్బు తీసుకొని భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ పట్టణ సీఐ బి వీరప్రసాద్ తెలిపారు. మారుపాక గ్రామానికి చెందిన గడ్డి నాగరాజు, బచ్చు వంశీకృష్ణ అనే వ్యక్తులు వేములవాడ పట్టణానికి చెందిన కొండ దేవయ్య, కొండ నర్సయ్య సోదరుల దగ్గర ఎకరం ఇరవై గుంటల భూమి కొనుగోలు కోసం మూడు కోట్ల ఐదు లక్షలు రూపాయలు చెల్లించారన్నారు. కొండ దేవయ్య, కొండ నరసయ్య ఒక ఎకరం భూమి మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారని, మిగతా 20 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఎన్నిసార్లు అడిగినా చేయలేదని, పైగా తమను బెదిరిస్తున్నారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొండ దేవయ్య, కొండ నర్సయ్యలపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

- కొండగట్టు ఆలయానికి ఇద్దరు ఈవోల నియామకం
- ముందుగా వేములవాడ ఈవో.. మరోసారి వరంగల్ డీసీ
- గందరగోళంగా దేవాదాయ శాఖ తీరు

మల్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవో నియామకంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల మధ్య సమన్వయలోపం గందరగోళంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొండగట్టు ఈవో బదిలీ కావడంతో మరొకరి నియామకం కోసం గురువారం దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ప్రభుత్వం మరొకరిని నియమిస్తూ జీవో జారీ చేసింది. దీంతో అధికారుల తీరు సర్వత్రా విస్మయం కలిగించింది. కొండగట్టు ఈవో రామకృష్ణరావును బదిలీ చేస్తూ ఆయన స్థానంలో వేములవాడ ఈవో వినోద్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం కమిషనర్ తరుపున దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం రామకృష్ణరావు కొండగట్టు నుంచి రిలీవ్ కాగా వినోద్ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. మళ్లీ సాయంత్రం వరంగల్‌లో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ టి శ్రీకాంత్‌రావును నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్ జీవో జారీ చేశారు. రోజుకో ఉత్తర్వు జారీ కావడంతో దేవాదాయ శాఖ అధికార వర్గాల్లో అయోమయం నెలకొంది.

● ఈవోగా బాధ్యతలు చేపట్టిన వినోద్



బాధ్యతలు చేపడుతున్న వినోద్

కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవోగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఈవో కె వినోద్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఈవో ఎం రామకృష్ణరావు సికింద్రాబాద్‌లోని గణేశ్ టెంపుల్ ఈవోగా బదిలీ కావడంతో వినోద్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించిన అనంతరం ఈవో వినోద్‌ను ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు అభినందించారు.

అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్

- సస్పెన్షన్‌లో ఉన్న తహసీల్దార్ రిమాండ్

చందుర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళకు చెందిన భూమిని మరో వ్యక్తి పేరు మీదకి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన కేసులో సస్పెన్షన్‌లో ఉన్న తహసీల్దార్‌ను పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు శనివారం వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన సంటి లస్మవ్వకు గ్రామ శివారులోని సర్వే నంబరు 322/4/1లో ఎకరం భూమి ఉంది. ఆ భూమిలో 40 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటోంది. రైతు బంధు డబ్బులు రాకపోవడంతో లస్మవ్వ కూతురు ప్రమీల అధికారులను సంప్రదించింది. ధరణి పోర్టల్‌లో 40 గుంటలకు బదులు ఆరు గుంటలు మాత్రమే చూపించడంతో చందుర్తి రెవెన్యూ కార్యాలయంలో విచారణ చేసింది. మిగతా 34 గుంటల వ్యవసాయ భూమిని మల్యాల గ్రామానికి చెందిన గోంటి రాజానర్సుపై అప్పటి తహసీల్దార్ నరేష్ 2018-19లో అక్రమంగా పట్టా మార్పు చేసినట్లు గుర్తించింది. తన తల్లి లస్మవ్వ పేరుపై ఉన్న ఎకరం భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న గొంటి రాజనర్సు, పట్టా మార్పు చేసిన అప్పటి తహసీల్దార్ నరేష్‌తోపాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని 27 నవంబరు 2024న ఫిర్యాదు చేసింది. అప్పటికే తహసీల్దార్ నరేష్‌పై రెండు అక్రమంగా పట్టా చేసిన కేసులు ఉన్నట్లు, తాజాగా లస్మవ్వ భూమి అక్రమ పట్టా కేసులో శనివారం అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టా మార్పు చేయించుకున్న గుంటి రాజనర్సు మృతి చెందగా మరో నలుగురిపై కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

● ఇద్దరు రిటైర్డ్ తహసీల్దార్లపై కేసు

జిల్లాలోని చందుర్తి మండలం ఎనగల్, మల్యాల గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా పట్టా చేసి రిటైర్మెంటైన మరో ఇద్దరు తహసీల్దార్లపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎనగల్ గ్రామంలోని సర్వే నంబరు 516లో గుంటి రాజయ్యకు చెందిన భూమిలో 5 గుంటల స్థలాన్ని గుంటి గంగయ్యకు, మల్యాల గ్రామంలో నేరెళ్ల ఎల్లయ్యకు చెందిన సర్వే నంబరు 893లో 18 గుంటల భూమిని పత్తిపాక దేవ రాజుకు నిబంధనలకు విరుద్ధంగా పట్టా మార్పిడి చేయడంపై బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరు రిటైర్డ్ తహసీల్దార్లపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అప్పు చెల్లించాలని వేధింపులు.. మహిళ ఆత్మహత్య

- సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణం



భారతి(ఫైల్)

సుల్తానాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో ఓ మహిళ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన చిలగాని భారతి (56) శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం సుల్తానాబాద్ కోర్టు ఆవరణలోని ఓ చెట్టుకు ఉరి వేసుకున్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. గాంధీనగర్‌కు చెందిన తమ సమీప బంధువు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండా మురళి అప్పు చెల్లించాలని వేధించడంతోనే భారతి అఘాయిత్యానికి పాల్పడిందని కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం మూడు లక్షల అప్పు తీసుకోగా ఇప్పటికే ఆరు లక్ష లు చెల్లించామని, ఇంకా రెండు లక్షలు ఇవ్వాలని వేధిస్తున్నాడని పేర్కొన్నారు.

● నాయకుడి ఇంటి వద్ద మృతదేహంతో ఆందోళన..

అప్పు చెల్లించాలని వేధించడంతోనే భారతి ఆత్మహత్య చేసుకుందని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు, బంధువులు మురళి ఇంటి వద్ద మృతదేహంతో ఆందోళన చేశారు. పోలీసుల జోక్యంతో వారు ఆందోళన విరమించారు.

ఎస్సారెస్పీ కాలువలో పేరుకుపోయిన చెత్త

- పంట పొలాల గుండా ప్రవహిస్తున్న నీరు - ఆందోళనలో రైతులు

రాయికల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలోని ఎస్సారెస్పీ కాలువలో చెత్తాచెదారం పేరుకోయింది. దీంతో కాలువకు విడుదల చేసిన నీరు తూముల నుంచి వెళ్లలేక రైతులు వేసిన పంట పొలాల గుండా ప్రవహిస్తున్నాయి. దీంతో నాట్లు వేసిన కొందరు రైతుల పంటలతో పాటు వీరి చుట్టూ ఉన్న దాదాపు 20 నుంచి 50 ఎకరాలపైగా పంట నష్టం జరిగింది. వరి నాట్లకు ముందు చదును చేసిన బురద మన్ను మొత్తం కొట్టుకుపోవ డంతో భూమి సారవంతంతో పాటు ఉన్న పోషకాలు కొట్టుకుపోయాయని, మళ్లీ తిరిగి నాట్లు వేసే సమయం, పరిస్థితులు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల అపార నష్టాన్ని అధికారులు గుర్తించి పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. అప్పట్లో కాలువ నీరు అందరికీ చేరేవిధంగా లష్కర్లు నీటి విడుదల ముందే కాలువల పరిస్థితిని పరిశీలించి తూముల గుండా ఎలాంటి ఆటంకం లేకుండా నీరు ప్రవహించేలా చర్యలు తీసుకునేవారనీ, ఇప్పుడు కాలువల పరిశీలన చేసే నాథుడే లేడని, అందువల్లనే ఇప్పుడీ పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలని మండల అధికారులను కోరారు.



పంట పొలాల నుంచి ప్రవహిస్తున్న ఎస్సారెస్పీ కాలువ నీరు



- ఏపీకే ఫైల్స్ క్లిక్ చేస్తే హ్యాకర్ల చేతిలోకి సమాచారం
- పీఎం కిసాన్ లింకులతో పలువురి ఫోన్‌లు హ్యాక్

గన్నేరువరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. కొందరి అత్యాశను సైబర్ నేరగాళ్లు అనుకూలంగా మలుచుకుని నకిలీ లింకులు పంపుతున్నారు. ఓటీపీ చెప్పమని నమ్మబలుకుతూ ప్రజల సొమ్మును సులువుగా ఖాతాల్లోంచి దోచే స్తున్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమా లను నిర్వహిస్తున్నా బాధితులు రోజు రోజుకూ పెరుగుతూనే ఉండడంతో ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. సైబర్ నేరగాళ్లు వాట్సాప్ గ్రూపుల ద్వారా పలు ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల పేరిట ఏపీకే ఫైల్స్ లింకులను పంపుతూ ఫోన్‌లను హ్యాక్ చేస్తున్నారు.

గన్నేరువరం మండలంలోని వివిధ గ్రామా ల్లో ఇటీవల సైబర్ నేరగాళ్లు పంపించిన పీఎం కిసాన్ లింకులతో మండలంలో పదుల సంఖ్యలో పలువురి ఫోన్‌లు హాక్ అయ్యాయి. హ్యాక్‌కు గురైన ఫోన్ నంబర్ నుంచి మండలంలోని పలు వాట్సాప్ గ్రూపులలో పీఎం కిసాన్ లింక్ వచ్చింది. దీంతో పీఎం కిసాన్ డబ్బులు తమ ఖాతాలో పడేందుకు అప్‌డేట్ కోసమనే ఆలోచనతో కొందరు ఆ లింక్‌ను ఓపెన్ చేశారు. వెంటనే వారి ఫోన్‌లో వాట్సాప్, ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతర యాప్‌లు పనిచేయకపో వడంతో తమ ఫోన్‌లు హ్యాక్ అయ్యాయని గుర్తించారు. హ్యాక్ అయిన విషయాన్ని బ్యాంక్ అధికారులకు తెలిపి వారి ఖాతాలను హోల్డ్‌లో పెట్టించారు. గుండ్లపల్లిలో ఓ మహిళకు హెల్త్ ఇన్సూరెన్స్ క్లైం డబ్బులు వచ్చాయని మీ ఫోన్‌పే నంబర్ నుంచి రిక్వెస్ట్ పెట్టమని గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో ఆమె వెంటనే తన ఫోన్ నుండి రిక్వెస్ట్ పంపింది. దీంతో వెంటనే తన ఖాతా నుంచి 92 వేలు హ్యాకర్లు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. వెంటనే గుర్తించిన మహిళ టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని హ్యాకర్ల నుంచి 82 వేలు రికవరీ చేశారు. సాంబయపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ క్రైం బారిన పడి లక్షా పదిహేడు వేలు పోగొట్టుకు న్నాడు. అతడు వెంటనే స్పందించ కుండా నాలుగో రోజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రికవరీ చేయలేకపోయారు.

ఏపీకె లింకులు ఓపెన్ చేయొద్దు

- ఎస్ఐ తాంత్ర నరేష్, గన్నేరువరం



స్మార్ట్ ఫోన్‌ల ద్వారా వివిధ యాప్‌ల పేరుతో, ఏపీకె లింక్‌లను పంపిస్తూ సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారు. ఏపీకె లింకులు చాలా ప్రమాదకరం ఒకసారి ఓపెన్ చేశామంటే ఫోన్ మొత్తం హ్యాకర్ల గుప్పిట్లోకి వెళ్ళి ఫోన్ ఆపరేట్ చేస్తారు. ఆన్‌లైన్‌లో వచ్చే ఆకర్షణీయ ప్రకటనలు, ఏపీకె ఫైల్స్ చూసి మోసపోవద్దు. లక్కీ స్కీంల పేరిట ప్రలోభపెట్టినా పట్టించుకోవద్దు. వివిధ రూపాల్లో తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపి చెప్పమని, డబ్బులు పంపమని అడిగితే కచ్చితంగా తమను మోసపుచ్చుతున్నారని గుర్తించాలి. నిరుద్యోగులు, మహిళలు అవగాహన లేకుండా సోషల్ మీడియా ద్వారా ఏపీ డౌన్‌లోడ్ చేసుకోవద్దు. అపరిచితుల నుంచి వచ్చే కాల్స్ పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలి.



సంతూర్ లోగో ముగ్గు వేస్తున్న మహిళ



సెల్వియా, పెర్ఫెక్టు లోగో ముగ్గు వేస్తున్న మహిళ



పాపను ఎత్తుకుని ముగ్గు వేస్తున్న యువతి



ఏబీఎన్ పేరుతో వేసిన ముగ్గు



ముగ్గు వేస్తున్న మహిళ

పెద్దపల్లి జిల్లాలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ



ముగ్గులు వేస్తున్న మహిళలు

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ హైస్కూల్ ఆవరణలో 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు..గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టువారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్వియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' పోటీలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ పోటీలకు 92 మంది మహిళలు హాజరయ్యారు. వీరు వేసిన ముగ్గులు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అందమైన ముగ్గులకు మొదటి, రెండు, మూడవ బహుమతులు ఇవ్వగా 20 మందికి కన్సోలేషన్ బహుమతులు, పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ బహుమతులు ఇచ్చారు.

\- పెద్దపల్లి, ఆంధ్రజ్యోతి



లోగో ముగ్గులు వేసిన వారికి బహుమతులను అందజేస్తున్న ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ సంపత్ కుమార్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు బిరుదు సమత, వనజ, మంగాదేవి, కవిత

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

భగత్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ రాష్ట్రకమిటీ సభ్యుడు జె వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీపీఐ పార్టీ జిల్లాకమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు ఆర్థిక పరిస్థితి సరిగా లేదని కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కన పెట్టి కార్పొరేట్ సంస్థలకు ప్రజా ధనాన్ని ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో గీట్ల ముకుందరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, బీమాసాహెబ్, సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, జి రాజేశం, నరేష్ పటేల్, శీలం అశోక్, కె నాగమణి, కొప్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

మంథని, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మంథని జేకేఏ షోటోకాన్ క్రీడాకారులు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించనట్లు కోచ్ కోండ్ర నాగరాజు శనివారం తెలిపారు. డిసెంబరు 31 నుంచి జనవరి 3 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో తన ఆధ్వర్యంలో పాల్గొన్న క్రీడాకారుల్లో 60 కేజీల విభాగంలో పైడిపాటి బాబీవర్మ సిల్వర్ మెడల్, డుల్‌గచ్ దేవాన్ష్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన బాబీవర్మకు ప్రభుత్వం రూ. 15 వేల నగదు ప్రోత్సాహక బహుమతిగా ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్ర పోటీల్లో మెడల్స్ సాధించిన బాబీవర్మ, దేవాన్ష్, కోచ్ కోండ్ర నాగరాజులను జేకేఏ సౌత్ జోన్ ఇన్‌చార్జి రాపోలు సుదర్శన్, ఇండియా కోచ్ కీర్తన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, కియో రాష్ట్ర ట్రైనర్ మల్యాల రామస్వామి, పెద్దపల్లి జిల్లా ఎస్ జీఎఫ్ సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్, శంకర్‌గౌడ్ అభినందించారు.

ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధికి చర్యలు

- ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్,

- వేములవాడ ఆలయ అభివృద్ధిపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, పక్కన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక క్షేత్రంగా వేములవాడ అభివృద్ధి అయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శనివారం రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ ఆలయ కార్యాలయంలో ఫర్నీచర్ కొనుగోలు చేయాలని, సంవత్సరం క్రితం ఆదేశాలు జారీ చేసినా ఇప్పటివరకు జరగలేదని మండిపడ్డారు. సంక్రాంతి నాటికి అన్నదాన భోజన హాల్, సమావేశ మందిరంలో నూతన ఫర్నీచర్ అందుబాటులోకి తేవాలని అన్నారు. భక్తుల వసతి కోసం సూట్ రూమ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

బద్దిపోచమ్మ ఆలయ పునర్‌నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలన్నారు. రూ. 12 కోట్లతో గుడిచెరువు, మినీ ట్యాంక్‌బండ్ అభివృద్ధి, నీటిసరఫరా, వాకింగ్ ట్రాక్, విద్యుత్ వంటి పనులు శివరాత్రి ముందు ప్రారంభం కావాలని అన్నారు. శివార్చన వేదిక, వంద ఫీట్ల రోడ్ల విస్తరణ పనులు శివరాత్రి నాటికి పూర్తి కావాలన్నారు ఆలయ విస్తరణకు సంబంధించి డీపీఆర్ పనులు నెలాఖరు నాటికి అందించాలని, అన్నదానసత్ర భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు అందించాలని ఆదేశించా రు. అంబేద్కర్ జంక్షన్ వద్ద అభివృద్ధి పనులు కొనసాగించి అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు.

జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ దేవాలయానికి సంబంధించి అవసరమైన ఫర్నీచర్‌ను వెంటనే షార్ట్ టెండర్లు పిలిచి మూడు రోజుల్లోగా కొనుగోలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

10న ముక్కోటి ఏకాదశి ఉత్సవం

- స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

వేములవాడ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 10వ తేది శుక్రవారం రోజున ముక్కోటి ఏకాదశి ఉత్సవము నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు శనివారం తెలిపారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 3.10 గంటల నుంచి 3.40 గంటల వరకు సుప్రభాతం, 3.40 గంటల నుంచి 3.50 గంటల వరకు ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు. ఉదయం 3.50 గంటల నుంచి ఐదు గంటల వరకు స్వామి వారికి ప్రాతఃకాల పూజ, 5.10 గంటల నుంచి స్వామి వారలు ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశ అనంతరం భక్తులకు స్వామి వారి ఉత్తర ద్వార దర్శనము కల్పించనున్నట్లు తెలిపారు.

అనంతరం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభిషేకము టికెట్లు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అన్నపూజ సేవా టికెట్లు యథావిధిగా కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

వ్యాపారులకు పోలీసుల పేరుతో సైబర్ నేరగాళ్ల ఫోన్లు

» చోరీ సొత్తు కొన్నారని బెదిరింపులు » డబ్బులు పంపితే కేసులు ఉండవని నమ్మించే యత్నం



మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బులియన్ మార్కెట్‌లోని పలువురు వ్యాపారులకు శనివారం పోలీసుల పేరుతో సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేశారు. మీరు చోరీ సొత్తు కొన్నారు.. నిబంధనలకు విరుద్ధంగా నగలు కుదువపెట్టుకున్నారని, మీ~ పై కేసు నమోదు అయ్యిందంటూ బెదిరిం పులకు దిగారు. అరెస్టు కాకుండా ఉండాలంటే తాము చెప్పిన నెంబర్‌కు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపాలని, అది కూడా త్వరగా పంపాలంటూ హెచ్చరికలు చేశారు. పట్టణంలోని పలువురు వ్యాపారులకు ఈ తరహా ఫోన్లు రావడంతో కొంత గందరగోళానికి లోనయ్యారు. తరువాత తేరుకుని సైబర్ నేరగాళ్ల పనిగా గుర్తించారు. కొన్ని రోజుల క్రితం తాము నగరపాలక సంస్థ నుంచి మాట్లాడుతున్నామని, ట్రేడ్ లైసెన్స్ పెనాల్టీ పడుతుందని, ఒకేసారి చెల్లిస్తే మాఫీ చేస్తామంటూ వ్యాపారులను నమ్మించారు. ఇదే తరహాలో బులియన్ మార్కెట్‌లకు ఫోన్లు వచ్చాయి. గోదావరిఖని బులియన్ మార్కెట్‌లో . సీఐ ఇంద్రసేనారెడ్డి వ్యాపారులు, నగల తయారీదారులకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి



మాట్లాడుతున్న పురుషోత్తం

తిమ్మాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం అన్నారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా శనివారం జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా మారాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపవద్దని చెప్పారు. అతివేగంగా వాహనాలు నడపడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. ,. కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్‌చక్రవర్తి, సీనియర్ ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ హరిత, కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌యూ రిజిస్ట్రార్‌గా రవికుమార్



రవికుమార్‌ను అభినందిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ ప్రొఫెసర్ రవికుమార్ జాస్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన వీసీ ఉమేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రవికుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే తన బాధ్యత అని అన్నారు. రిజిస్ట్రార్ రవికుమార్‌కు 24 సంవత్సరాల బోధన అనుభవం ఉంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో 40 పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఏడు పుస్తకాలను రచించారు. ప్రస్తుతం తెలంగాణ కామర్స్ అసోసియేషన్‌కు జనరల్ సెక్రెటరీగా, ఇండియన్ కామర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా ఉన్నారు. ఈయన గతంలో కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో కామర్స్ ఇంటర్నేషనల్ బిజినెస్ విభాగానికి అధిపతిగా పనిచేశారు. ప్రస్తుతం ప్రొఫెసర్ జి రామిరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌కు డైరెక్టరేట్ ఆఫ్ డిస్ట్రిక్ట్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కాలేజెస్, ఉస్మానియా యూనివర్శిటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఎస్‌యూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహించిన ప్రొఫెసర్ వరప్రసాద్ శాతవాహన యూనివర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా కొనసాగనున్నారు.

రాజన్నను దర్శించుకున్న ఏసీపీ

వేములవాడ కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి వచ్చిన ఆయన ముందుగా రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుని శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి ప్రసాదం అందజేశారు.

స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్‌గా కిషోర్‌రెడ్డి

ధర్మారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణసంస్థ (ఎస్ఆర్‌టీఆర్ఐ) చైర్మన్‌గా ధర్మారం మండల కేంద్రానికి చెందిన నార కిషోర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కిషోర్‌రెడ్డి ప్రస్తుతం ఎస్ఆర్‌టీఆర్ఐకి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎస్ఆర్‌టీఆర్ఐకి తనను చైర్మన్‌గా నియమించాలని ప్రభుత్వానికి కిషోర్‌రెడ్డి అభ్యర్థన పెట్టుకోగా పరిశీలించిన ప్రభుత్వం యాదాద్రి భువనగిరి జిల్లా జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా నియామకమైన కిషోర్‌రెడ్డి 3 ఏళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. తన నియామానికి సహరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులను కదిలించిన వంటా వార్పు



విచారణ జరుపుతున్న ఆర్డీవో గంగయ్య, తదితరులు

పాలకుర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కన్నాల, రాణాపూర్, లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్ గౌడ కుల సంఘాల నాయకులు, పలువురు ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం ఎన్‌టీపీసీకి చెందిన బూడిద చెరువు వద్ద నిర్వహించిన వంటావార్పు కార్యక్రమం పలు ప్రభుత్వ శాఖల అధికారులను కదిలించింది. ఆయా గ్రామాల్లో గల వందలాది ఎకరాల్లో ఉన్న ఈత, తాటి చెట్లను ఎన్టీపీసీ యాజమాన్యం అన్యాయంగా భారీ మిషన్ల సహాయంతో తొలగించడాన్ని నిరసిస్తూ రెండు రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, స్థానిక తహసీల్దార్ ఎం జ్యోతి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

చదరంగంలో గని కార్మికుడి ప్రతిభ

కోల్ ఇండియా స్థాయిలో రాణిస్తున్న మర్రి మహేందర్



▲ చెస్ ఆడుతున్న మర్రి మహేందర్



గని కార్మికుడిగా విధుల్లో మర్రి మహేందర్ ▶



ఆలిండియా పబ్లిక్ సెక్టార్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో బహుమతి అందుకున్న మహేందర్(ఫైల్)

కోల్‌సిటీటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన సింగరేణి గని కార్మికుడు మర్రి మహేందర్ చదరంగం క్రీడలో రాణిస్తున్నాడు. ఆర్‌జీ-1లోని జీడీకే 11 ఇంక్లయిన్‌లో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న మహేందర్‌కు పదేళ్ళ వయస్సులో చెస్ ఆటపై ఆసక్తి కలిగింది. ఓవైపు మెడికల్ షాపులో పనిచేస్తూనే చెస్ క్రీడకు సంబంధించిన బుక్స్ చదివి మెళకువ లు నేర్చుకున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ రేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని 1623 రేటింగ్ సాధించాడు. తండ్రి అయిలయ్య సింగరేణిలో రిటైర్ అయ్యాక గని కార్మికుడిగా విధుల్లో చేరాడు. చెస్‌పై ఉన్న ఇష్టంతో సింగరేణిలో నిర్వహించే చదరంగం పోటీల్లో పాల్గొని గుర్తింపు తెచ్చుకున్నాడు. రెండుసార్లు కోలిండియా స్థాయి చెస్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. కంపెనీ స్థాయిలో మూడుసార్లు చెస్ చాంపియన్‌షిప్‌ను సాధించాడు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ధర్మారం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండల ఆదర్శ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బి.సింధుప్రియ డిసెంబరు 10 నుంచి 12 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 6 నుంచి 10 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో అండర్ 19 విభాగంలో సింధుప్రియ పాల్గొంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమురయ్య, మేకల సంజీవరావు తదితరులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ పంజల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పద్మశాలి వీధి, షా సాహెబ్ మహల్, పాత బజార్, తెలంగాణ చౌక్ ప్రాంతం, లక్ష్మీనగర్‌లో కొంత భాగం, కమాన్ నుంచి హౌసింగ్ బోర్డు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కంటి శస్త్ర చికిత్సలు

కరీంనగర్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ యంజీఎఫ్ ఆధ్వర్యంలో పలువురికి శనివారం కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. కరీంనగర్ పట్టణం కిసన్‌నగర్‌కు చెందిన బండి ఓదెలుతో పాటు రేకుర్తి లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, ట్రస్టు మెంబర్ కోల అన్నారెడ్డి సహకారంతో 146 ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా శస్త్ర చికిత్సలు నిర్వహించుకున్న రోగులకు ఆసుపత్రి ఆవరణలో పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆసపత్రి టెక్నీషియన్ చింతల ప్రభాకర్ పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ది కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను అదనపు కలెక్టర్ కె.లక్ష్మీకిరణ్ ఆవిష్కరించారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎస్.రామానుజా చార్యులు, అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, సభ్యులు మడుపు మోహన్, ముక్క భాస్కర్, విద్యాసాగర్, ఆర్.సందీప్, కలీం, లక్ష్మన్‌రాజు, సీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

● అవీ.. ఇవీ

●కరీంనగర్ టౌన్: విజయవాడలో ఇటీవల నిర్వహించిన శ్రీమద్భాగవద్గీత పారాయణ పోటీల్లో స్థానిక అద్విత ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని కె.లాస్యశ్రీ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. శనివారం పాఠశాలలో లాస్యశ్రీని ఎండి అనుదీప్, ప్రిన్సిపాల్ మాదురి శ్వేత అభినందించారు.

●కరీంనగర్ కల్చరల్: స్థానిక వావిలాల పల్లె సీతారామచంద్రస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవికి భక్తులు సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేచినేని వనజ, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మేచినేని అశోక్‌రావు, బీవీరావు పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థలలో బీసీలకు ఉన్న 33 రిజర్వేషన్లను 23 శాతానికి కుదించిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు అధికారంలో కోల్పోయిన తరువాత బీసీ రిజర్వేషన్ల పేరిట కొత్త డ్రామా ఆడుతున్నారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు.

'మౌలిక వసతుల కల్పనకు కృషి'



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ లో 120కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన ప్రాజెక్టులను సంక్రాంతి తర్వాత ప్రారంభోత్సవాలు చేసి ప్రజలకు అంకితం చేస్తామని ఆయన అన్నారు. శనివారం 35వ డివిజన్‌లో మేయర్ పర్యటించారు. శ్రీనగర్ కాలనీలో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డితో కలిసి నగరపాలక సంస్థకు చెందిన 37లక్షల రూపాయల నిధులతో ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ పైపులైన్ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు, అధికారుల సమిష్టి కృషితోనే నగరంలో అభివృద్ధి జరిగిందన్నారు. జనవరిలోనే 120 కోట్లతో అభివృద్ధి చేసిన స్పోర్ట్స్ కాంప్లెక్స్, మల్టిపర్పస్ పార్క్, రాజీవ్ పార్కు, ఈ క్లాస్ రూమ్స్, పద్మానగర్ సమీకృత మార్కెట్, స్ట్రీట్ వెండిగ్ షాపులు, అంబేడ్కర్ విగ్రహం, 24/7 వాటర్ సప్లై పైలెట్ ప్రాజెక్టు పనులను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, స్థానిక శాసన సభ్యులు గంగుల కమలాకర్ లను ఆహ్వానించి ప్రారంభోత్సవాలు చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న కశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్, కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం వద్ద గల సమీకృత మార్కెట్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ భవనం, డిజిటల్ లైబ్రరీ భవనాల పనులు ప్రస్తుతం చివరి దశలో కొనసాగుతున్నాయని అన్నారు. వాటిని పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అంకితం చేస్తామన్నారు. పెద్ద ప్రధాన స్టాంవాటర్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేసి రోడ్లను విస్తరించామని తెలిపారు. చిన్న కాలనీల్లో ఎస్‌డబ్లుజీ డ్రైనేజీ పైపులైన్ ద్వారా పనులు చేసి గల్లీలను విస్తరించామని తెలిపారు. 35వ డివిజన్‌లో సమస్యలు లేకుండా చేశామని అన్నారు. కార్యక్రమంలో ఈఈలు సుబ్రహ్మణ్యం, డీఈ అయూబ్‌ఖాన్, ఏఈ గట్టు స్వామి డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

కరీంనగర్‌టౌన్,జనవరి 4(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థను యూజీడీ ఫ్రీ నగరంగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం 55వ డివిజన్ మంకమ్మతోట ప్రాంతంలో కొనసాగుతున్న యూజీడీ సీవరేజ్ క్లీనింగ్ పనులను కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అమృత్ పథకంలో యూజీడీ ట్రంక్ మెన్స్ శుభ్రత పనులు ప్రారంభం చేశామన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య శాఖ అధికారి దేవేందర్‌రెడ్డి, నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన టీఎన్‌జీవో నాయకులు

సుభాష్‌నగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా టీఎన్‌జీవో నాయకులు మంత్రులను కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు కలిసి నూతన సంవ్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలి



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో శనివారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒలింపియాడ్ శిక్షణను కలెక్టర్ పమేలా సత్పతి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఒలింపియాడ్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను పోటీ పరీక్షల్లో ముందు వరుసలో నిలిపేందుకు శిక్షణ అందిస్తున్నా మన్నారు. ఇందుకు గాను నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ముందుకు వచ్చాయన్నారు. ఇప్పటికే ప్రైవేట్ పాఠశా లల భాగస్వామ్యంతో టెడ్ ఎడ్ కోచింగ్ అందించి ఇద్దరు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అంతర్జాతీయ వేదికపై ప్రసంగించే అవకాశాన్ని కల్పించామన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 350మంది విద్యార్థులకు ఒలంపియాడ్ ఫౌండేషన్ శిక్షణ అందిస్తున్నామన్నారు. డీఈవో జనార్దన్‌రావు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం కల్పించిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒలింపియాడ్ శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తామన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేయనున్న స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి, విద్యాశాఖ క్వాలిటి కో-ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించని పాఠశాలపై చర్య తీసుకోవాలి'

గణేశ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో ఫైర్ సేఫ్టీ లేకుండా పాఠశాలను నడిపిస్తున్న మాంటిస్సోరి స్కూల్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జాతీయ బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సిరిశెట్టి రాజేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ కరీంనగర్-వరంగల్ వెళ్ళే రహదారిలో ఉన్న పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న భవనాల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు ప్రశాంత్, నస్పూరి వెంకటేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

భగత్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పట్టణంలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను మున్సిపల్ అధికారులు శనివారం కూల్చి వేశారు. మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్ ఆదేశాల మేరకు కొత్తపల్లి పట్టణంలో సర్వే నెంబర్ 205లో అక్రమంగా నిర్మిస్తున్న రెండు షెడ్లను మున్సిపల్ సిబ్బంది కూల్చి వేశారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కరీంనగర్ క్లబ్‌లో శనివారం మేయర్ సతీమణి యాదగిరి అపర్ణా సునీల్‌రావు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగవల్లులు, బొమ్మల కొలువు, దీపాలు, పలువురు దేవతా విగ్రహాలతో వేదికను అలంకరించారు.

'కాంగ్రెస్ సభకు తరలిరావాలి'

కరీంనగర్ అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే సంవిధాన్ బచావో బహిరంగ సభకు తరలి రావాలని కాంగ్రెస్‌పార్టీ మనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండీ తాసొద్దీన్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

ముగిసిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కరీంనగర్ రూరల్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే కరీంనగర్ మండలంలో పూర్తయింది. పంచాయతీ కార్యదర్శులతో పాటు, ఉపాధిహామీ సిబ్బంది సహకారంతో మండలంలో వందశాతం సర్వే పూర్తి చేశారు. మండలంలో 9,058 మంది దరఖాస్తు చేసుకోగా గత నెల 11వ తేదీ నుంచి సర్వే చేపట్టారు. సర్వేపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సూపర్ చెక్ పేరిట క్రాస్ చెక్ చేస్తున్నారు. ఎంపీడీవో సంజీవరావు మూడు రోజులుగా మండలంలో చేపట్టిన సర్వేను తిరిగి వివరాలు సరి చూస్తున్నారు. మరో నాలుగైదు రోజుల పాటు సర్వేపై క్రాస్ చెకింగ్ ఉంటుందని ఎంపీడీవో సంజీవరావు తెలిపారు.

సాంఘికశాస్త్ర ప్రతిభాపాటవ పరీక్ష

కరీంనగర్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పరీక్షను శనివారం నగరంలోని భగత్‌నగర్‌లో గల ట్రినిటి జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సామాజిక విలువలు పెంపొందించే విధంగా తన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుపతి, ఆరెల్లి కుమారస్వామి, కోశాధికారి పుల్లూరి రవీందర్, ట్రినిటి కళాశాల ప్రతినిధులు రమణారెడ్డి, పవన్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు'

గణేశ్‌నగర్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఉండే పింగాణీ జాయింట్‌ల వద్ద పక్షి, ఉడుత, తొండ చేరితే తక్షణమే విద్యుదాఘాతానికి గురై అవి మృతిచెందడంతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీన్ని నివారించేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌లకు డెన్ ప్లాస్ట్, ఎచ్‌డిపిఈ పైప్స్ అమర్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ టౌన్-1 పంజాల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఉచితంగా తేనీటి పంపిణీ

కరీంనగర్ కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం తన సొంత ఖర్చులతో పోటీ పరీక్షల అభ్యర్థులకు నిత్యం టీ అందిస్తున్నారు. నవంబరు 2నుంచి ప్రతి రోజు మూడు వందలకు పైగా అభ్యర్థులకు టీ ఇస్తున్నారు. ఈసందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ పోటీ పరీక్షలు ఉన్నంత కాలం అభ్యర్థులకు టీని అందిస్తానని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గ్రంథాలయాలల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తాన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి

కరీంనగర్ క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద శనివారం ట్రాఫిక్ పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ట్రాఫిక్ సీఐలు రమేష్, స్వామి, ట్రాఫిక్ ఎస్ఐ పాల్గొన్నారు.

వార్డు ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగింత

కరీంనగర్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలోని 60డివిజన్లకు ఒక్కొక్కరిని వార్డు ఇన్‌చార్జి ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ రివైజ్డ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో డివిజన్ ఒక్కొక్కరు చొప్పున బాధ్యతలు అప్పగిస్తూ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కరీంనగర్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. శనివారం సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భిక్షపతి ఆధ్వర్యంలో వాణిజ్య పన్నులశాఖ కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జాయింట్ కమిషనర్ ఎస్ మధుసూదనాచారిని కలిసి వినతి పత్రం అందజేశారు.

పంట నష్టం చేసిన ఇద్దరిపై కేసు నమోదు

ఇల్లందకుంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాగొడ్డు రామన్నపల్లె గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పంట నష్టం చేసినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజకుమార్ శనివారం తెలిపారు. వాగొడ్డు రామన్నపల్లె గ్రామానికి చెందిన చింతం చంద్రమోహన్ మొక్కజొన్న పంట వేశాడు. అదే గ్రామానికి చెందిన తెప్ప కొంరయ్య, తెప్ప విజయపాల్ అనే ఇద్దరు గతంలో ఉన్న భూవివాదాన్ని దృష్టిలో ఉంచుకొని మొక్కజొన్న చేనుపై గడ్డి మందు పిచికారి చేశారు. దీంతో పంట దెబ్బదిని సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని చంద్రమోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

హుజూరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నిరవధిక సమ్మెలో ఉన్న ఎస్ఎస్ఏ, కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుమల తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- త్వరలో ఇల్లందకుంట ఆలయ కమిటీ నియామకానికి చర్యలు
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్



మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలోని హనుమాన్ ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం శనివారం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా కొలిపాక శంకర్, వైస్ చైర్మన్‌గా భల్లు పున్నంచందర్, డైరెక్టర్లుగా ప్రతాప నాగరాజు, భూసారపు శంకర్, మాచర్ల నరేష్, ఎర్ర మధులత, గాలిబు రాజేందర్‌తో ఆలయ ఈవో సుధాకర్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గంలోని దేవాలయం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామ న్నారు. ఇల్లందకుంట ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే ఆలయ కమిటీ నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు

జమ్మికుంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్‌లోని నారాయణగూడలో శనివారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు కలిశారు. జమ్మికుంటలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో నాయకులు కసుబోజుల వెంకన్న, ఎండి సలీం, ఎగ్గని శ్రీనివాస్, చిన్నింటి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు అవగాహన

హుజూరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద రోడ్డు భద్రత నిబంధనలపై మినీ వ్యాన్ డ్రైవర్లకు శనివారం ఎంవీఐ కంచి వేణు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు శ్రీకాంత్‌గౌడ్, వాహనదారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

హుజూరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కమల పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల 48గంటల దీక్ష

హుజూరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం 48గంటల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఎండీ అజ్జు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంఆర్ ఫిక్స్‌డ్ కార్మికులను, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు సరోజన, రాజేశ్వరి, సులోచన, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్ ఇప్పించాలి

శంకరపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సోషియో ఎకనామిక్ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యా యులకు డ్యూటీ సర్టిఫికెట్ ఇప్పించాలని పీఆర్టీయూటీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాటాడుతూ నవంబరు 2024లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన సోషియో ఎకనామిక్ సర్వేలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారన్నారు. ఉపాధ్యాయులు సీసీఎల్ పొందే అవకాశం ఉన్నందున డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్లెం మైపాల్‌రెడ్డి, నడిపల్లి నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపా.ధ్యక్షుడు వేముల లక్ష్మినారాయణ, రాష్ట్ర కార్యదర్శి వెంక ట్రాంరెడ్డి, మండల అసోసియేట్ అధ్యక్షుడు లింగారెడ్డి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

చిగురుమామిడి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్య మంలో చురుకుగా పాల్గొన్న బీఆర్ ఎస్ నాయకుడు మంకు శ్రీనివాస్‌రెడ్డి (40) మృతి బాధాకరమని, అతడి కుటుంబానికి అండగా ఉంటా మని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. మండలం లోని నవాబుపేట గ్రామానికి చెం దిన మాజీ ఎంపీటీసీ మంకు స్వప్న భ ర్త, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం రాత్రి గుం డెపోటుతో మృతి చెందాడు. శనివారం మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పార్టీ కండువా కప్పి నివాళులు అర్పించారు. శ్రీనివాస్‌రెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఉన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీలు కొత్త వినీత, అందె సుజాత, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాయకులు మామిడి అంజయ్య, సత్యనారాయణ, శరభందన్‌రెడ్డి, సదయ్య, ఓదయ్య, రవీందర్, మక్బుల్ పాషా, రాజిరెడ్డి, అనిల్ తదితరులు ఉన్నారు. శ్రీనివాస్‌రెడ్డిది పేద కుటుంబం కావడంతో గ్రామస్థులు చందాలు వేసి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు గ్రామస్థులు తదితరులు హాజరయ్యారు.

● సంక్షిప్తం..

● వీణవంక: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ శనివారం అందజేశారు.

● జమ్మికుంట రూరల్ జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేష్‌కు చెందిన క్యాలెండర్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ శనివారం ఆవిష్కరించారు.

- జాతీయ మానవ హక్కుల మండలి (ఎన్జీవో) ఉమ్మడి కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాటిపల్లి రాజును నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

● శంకరపట్నం: కాకతీయ ప్రధాన కాలువ నుంచి ఎస్కేప్ ద్వారా నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మాజీ సర్పంచ్‌లు దాసారపు భద్రయ్య, కాటం వెంకట రమణారెడ్డి, కొండ్ర రాజయ్య తహసీల్దార్ భాస్క ర్‌కు వినతిపత్రం అందజేశారు.

● మానకొండూర్: వన్నారం, గంగిపల్లి గ్రామాలకు చెందిన రామారావు, రెడ్డి రాధమ్మ అనే వ్యక్తులు ఇటీవల మృతి చెందగా శనివారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

- రాష్ట్ర స్థాయి సోషల్ ప్రతిభ పరీక్షకు మండలంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఎ రిషిక ఎంపికైంది.

● చిగురుమామిడి: చిన్నముల్కనూర్, ఇందుర్తి, చిగురుమామిడి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పరామర్శించారు.

● చొప్పదండి: చొప్పదండి అభివృద్ధికి 56 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

● తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ ఈఎన్‌సీ కార్యాలయంలో తిమ్మాపూర్, గన్నేరువరం టీఏస్జీవోస్ యూనిట్ క్యాలెండర్‌ను ఈఎన్‌సీ శంకర్ ఆవిష్కరించారు.

● హుజూరాబాద్‌రూరల్: శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సింగాపూర్‌లోని కిట్స్ ఇంజ నీరింగ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ శంకర్ అధ్య క్షతననిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు.